ప్రజాశక్తి
గురువారం 23 అక్టోబర్ 2025
5
విజయనగరం

ఉత్సవాలకు దాతల సాయం రూ.2.02కోట్లు

ప్రజాశక్తి-కంటోన్మెంట్

విజయనగరం ఉత్సవాల నిర్వహణకు 435 మంది దాతలు నుంచి 2,02,51,904 రూపాయలు జిల్లా యంత్రాంగం ప్రత్యేకంగా కేటాయించిన 'విజయ నగరం ఉత్సవాలు బ్యాంక్ ఖాతాకు జమ చేశారని కలెక్టర్ రామసుందర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఉత్సవాలు ప్రజల భాగస్వామ్యంతో అత్యంత వైభవంగా నిర్వహించుకున్నామని హర్షం వ్యక్తం చేశారు. ఈ ఉత్సవాలకు ఆర్థిక సహాయం అందించిన ప్రజలు, పారిశ్రామికవేత్తలు, వ్యాపారవేత్తలు, విద్యా, వైద్య రంగాల ప్రముఖులు సహా అందరికీ జిల్లా యంత్రాంగం తరపున ధన్యవాదాలు తెలిపారు. వచ్చిన నిధుల ద్వారా వివిధ ఉత్సవ కార్యక్రమాల నిర్వహణకు 1,41,39,019 రూపాయలు ఖర్చు అయ్యిందని, మిగతా 61,12,885 రూపాయలు ఉత్సవాల బ్యాంక్ ఖాతాలో ఉంచి, వచ్చే సంవత్సరం ఏడాది నిర్వహించే ఉత్సవాలకు వినియోగిస్తామని కలెక్టర్ తెలిపారు.

ఉపాధి చట్టానికి మోడీ ప్రభుత్వం తూట్లు

- వ్యవసాయ కార్మిక సంఘం జాతీయ కార్యదర్శి బి.వెంకట్
- పార్వతీపురంలో భారీ ప్రదర్శన
- 200 రోజులు ఉపాధి పని కల్పించాలి
- బహిరంగసభలో తీర్మానం

మహాసభ సందర్భంగా పార్వతీపురంలో పట్టణంలో భారీ ప్రదర్శన నిర్వహిస్తున్న వ్యకాస నాయకులు, కార్మికులు

ప్రజాశక్తి - పార్వతీపురం

జాతీయ ఉపాధి హామీ చట్టానికి అడుగడుగునా మోడీ ప్రభుత్వం తూట్లు పొడుస్తోందని వ్యవసాయ కార్మిక సంఘం జాతీయ కార్యదర్శి బి.వెంకట్ అన్నారు. బుధవారం వ్యవసాయ కార్మిక సంఘం 10వ జిల్లా మహాసభలు సంఘం జిల్లా అధ్యక్షులు రెడ్డి ఈశ్వరరావు అధ్యక్షతన జరిగాయి. అంతకుముందు స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి నాలుగు రోడ్ల కూడలి వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ప్రజా నాట్యమండలి సభ్యులు విప్లవ గేయాలు, నృత్యాలతో అలరించారు. అనంతరం జరిగిన బహిరంగ సభలో బి.వెంకట్ మాట్లాడుతూ యుపిఎ ప్రభుత్వంలో వామపక్షాల ఒత్తిడితో జాతీయ ఉపాధి హామీ, అటవీహక్కు చట్టాలు వచ్చాయన్నారు. ఈ చట్టాలను మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నిర్వీర్యం చేస్తోందని ధ్వజమెత్తారు. ఏటా కేంద్ర బడ్జెట్లో ఉపాధి హామీ చట్టానికి నిధులు తగ్గించు కుంటూ నేడు 1.38శాతానికి కుదించిం దన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో ఎన్డీయే కూటమిలో ఉన్న టిడిపి, జనసేన కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించకుండా మోడీ భజన చేస్తున్నాయని విమర్శించారు. ప్రశ్నించడానికే పార్టీ పెట్టానని గొప్పలు చెప్పుకొంటున్న పవన్ కళ్యాణ్ పేదలకు తీరని అన్యాయం చేస్తున్న మోడీని ఎందుకు నిలదీయడం లేదని ప్రశ్నించారు. విశాఖలో గూగుల్ డేటా కంపెనీ ఏర్పాటు చేస్తున్నట్లు టిడిపి నాయకులు గొప్పగా చెపుతున్నారని, ఆ కంపెనీ లో ఎస్సీ, ఎస్టీ, బిసిలకు ఎన్ని ఉద్యోగాలు ఇస్తారో స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. కంపెనీ ఏర్పాటు కాకముందే టిడిపి ప్రభుత్వం 22వేల కోట్లు రాయితీలు ప్రకటించడం విడ్డూరంగా ఉందన్నారు. గ్రీన్ ఫీల్డ్ హైవేల పేరుతో గిరిజనుల భూములను అదానీ, అంబానీలకు కట్టబెట్టేందుకు మోడీ ప్రభుత్వం ప్రయత్నిస్తోందని విమర్శించారు. అటవీ శాఖ మంత్రిగా పవన్ కల్యాణ్ దళిత, గిరిజనులకు జరుగుతున్న అన్యాయం గురించి ప్రశ్నించడం లేదన్నారు. ఇండియాపై అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఎన్ని సుంకాలు విధిస్తున్నా ప్రధాని మోడీ నోరు మెదపడం లేదని అన్నారు. ట్రంప్ టారిఫ్ లకు వ్యతిరేకంగా పోరాడాలని పిలుపు నిచ్చారు. అంబేద్కర్ రాసిన రాజ్యాంగాన్ని మార్చడానికి బిజెపి ప్రభుత్వం కుట్రలు చేస్తోందని అన్నారు. దళితులు, గిరిజనులకు ఎర్రజెండా ఎల్లప్పుడూ అండగా వుంటుందన్నారు. దేశ వ్యాప్తంగా ప్రభుత్వ రంగ సంస్థలను మోడీ ప్రభుత్వం ప్రయివేటీకరిస్తుంటే కేరళలో లెఫ్ట్ ప్రభుత్వం ప్రయివేటీకరణకు అడ్డుకట్ట వేస్తోందని చెప్పారు. వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు డి.వెంకన్న, జిల్లా కార్యదర్శి కొల్లి గంగునాయుడు, ఎపి రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బంటు దాసు, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి మన్మధరావు, ఐద్వా జిల్లా కార్యదర్శి బి.లక్ష్మీ, ప్రజానాట్యమండలి జిల్లా కార్యదర్శి కోరాడ ఈశ్వరరావు, ఆదివాసి గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కె.రామస్వామి, శ్రామిక మహిళా సంఘం జిల్లా నాయకులు పి.వరాలు, సౌహార్ధ సందేశాన్ని అందించారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మికులు, రైతులు, గిరిజనులు మహిళలు తదితరులు పాల్గొన్నారు. అనంతరం గిరిజన సామాజిక భవనంలో నిర్వహించిన ప్రతినిధుల సభలో పుచ్చలపల్లి సుందరయ్య, రెడ్డి శ్రీరామమూర్తి, డాక్టర్ ఆర్.కుప్పానాయుడు చిత్రపటాలకు పూలమాలవేసి, నివాళులర్పించారు. జిల్లా కార్యదర్శి కొల్లి గంగు నాయుడు ప్రవేశపెట్టిన సంఘం నిర్మాణ నివేదికను ప్రతినిధులంతా ఆమోదించారు. ప్రభుత్వ వైద్య కళాశాలల నిర్మాణ పనులను ప్రభుత్వమే నిర్వహించా లని, ఉపాధి పనులు 200రోజులు పెంచాలని, రోజుకు రూ.600 ఇవ్వాలని డిమాండ్ చేశారు.

జిల్లా అధ్యక్ష కార్యదర్శులుగా మర్రి శ్రీనివాసరావు, రెడ్డి ఈశ్వరరావు ఎన్నిక

వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు డి.వెంకన్న సమక్షంలో నూతన జిల్లా కమిటీని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్ష కార్యదర్శులుగా మర్రి శ్రీనివాసరావు, రెడ్డి ఈశ్వరరావు, కోశాధికారి గా కొల్లి సాంబమూర్తి, సహాయ కార్యదర్శులుగా కొల్లి గంగునాయుడు, పాలమిట్ట రాము, ఉపాధ్యక్షులుగా దూసి దుర్గారావు, జిల్లా కమిటీ సభ్యులుగా సిహెచ్ కృష్ణ, పిట్టల సీతారాం, భూతల మోహనరావు, ఎన్.సింహాచలం, ఎస్.రామారావు, వెన్నెల వేణు, వై.పాపమ్మతో పాటు మరో ఇద్దరిని కో-ఆప్షన్ సభ్యులుగా ఎన్నుకున్నారు.

ఉపాధి హామీ నిధులతో ఎస్‌సి కాలనీలు, శ్మశానాలకు రోడ్లు

ప్రజాశక్తి - కంటోన్మెంట్

ప్రతి నెల పౌర హక్కుల దినం గ్రామాల మధ్య లో జరగాలని, ఇందులో పోలీస్, రెవిన్యూ అధికారులు పాల్గొని ఎస్.సి, ఎస్.టి అత్యాచారాల నిరోధక చట్టం పై అవగాహన కలిగించాలని జిల్లా కలెక్టర్ ఎస్.రాం సుందర్ రెడ్డి తెలిపారు. బుధవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో జిల్లా విజిలెన్స్ అండ్ మోనిట రింగ్ సమావేశం కలెక్టర్ అధ్యక్షతన జరిగింది. ఎస్‌సి, ఎస్‌టి కాలనీల కు రహదారులు లేవని, శ్మశానాలు ఆక్రమణ కు గురవుతున్నాయని సభ్యులు కలెక్టర్ దృష్టికి తీసుకురాగా కలెక్టర్ స్పందిస్తూ ఉపాధి హామీ నిధులతో రహదారులను నిర్మించడానికి ప్రాణాళికల్లో పెట్టాలని డ్వామా అధికారులకు సూచించారు. హౌస్ హోల్డ్ సర్వే లో ఎస్.సి కులాల వారిని బి.సి కులాల వారిగా నమోదు చేయడం తో వారికి అందవలసిన లబ్ధి అందకుండా పోతోందని సభ్యులు బసవ సూర్యనారాయణ కలెక్టర్ కు విన్నవించగా ఎడిట్ ఆప్షన్ కోసం ప్రభుత్వానికి లేఖ రాస్తామని, ఆప్షన్ ఇస్తే మారుస్తామని తెలిపారు. ఎస్‌పి ఎఆర్ దామోదర్ మాట్లాడుతూ వసతి గృహాలు వద్ద సిసి కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని, దానివలన అసాంఘిక కార్యకలాపాలకు అడ్డుకట్ట వేయవచ్చునని తెలిపారు. సమావేశంలో ఎంపి కలిశెట్టి అప్పల నాయుడు, ఎంఎల్‌సి ఇందుకూరి రఘురాజు, డిఆర్ఒ శ్రీనివాస మూర్తి, సోషల్ వెల్ఫేర్ డిడి వెంకటేశ్వర రావు, ఆర్‌డిఒలు, డిఎస్‌పిలు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ రామసుందర్‌రెడ్డి; పక్కన ఎస్‌పి దామోదర్, ఎమ్‌పి కలిశెట్టి

పిజిఆర్ఎస్ సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత

జిల్లాలో పిజిఆర్ఎస్ సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలని కలెక్టర్ ఎస్. రాంసుందర్ రెడ్డి ఆదేశించారు. జిల్లా, డివిజన్, మండల స్థాయి అధికారులతో నిర్వహించిన టెలి కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ మాట్లాడుతూ, ప్రజా ఫిర్యాదుల పరిష్కారంలో పారదర్శకత, వేగం, బాధ్యత కలగలసిన విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ముఖ్యంగా ప్రీ-ఆడిట్ పెండింగ్‌లో ఉన్న ఫిర్యాదులను రెండు వారాల్లో 20శాతానికి తగ్గించాలని సూచించారు. సరిగా పరిష్కరించని ఫిర్యాదుల శాతం 8శాతం దాటకూడదని అన్నారు. శాఖాధికారుల ఆడిట్ సందర్భంలో అధికారులు ప్రజలకు నిజంగా ఫోన్ చేసి ఫిర్యాదుల స్థితి తెలుసుకుంటున్నారా లేదా కేవలం రికార్డింగ్ కోసం చూపిస్తున్నారా అనే విషయాన్ని సమీక్షించాలని రియల్ టైమ్ కాల్స్ చేయాలని ఆదేశించారు. విఐపిలు, ప్రజా ప్రతినిధులు ద్వారా వచ్చిన ఫిర్యాదులకు ప్రాధాన్యత ఇచ్చి సకాలంలో పరిష్కరించాలని ఆదేశించారు.

సహకార సంస్థలు డేటా ను అందించాలి

ఫంక్షనల్ సహకార సంస్థలు వారి డేటాను జిల్లా సహకార అధికారికి సమర్పించాలని, ఆ డేటా ను నేషనల్ కో పరేటివ్ డేటా బేస్ పోర్టల్ నందు అప్డేట్ చేయవలసి ఉంటుందని కలెక్టర్ ఎస్. రాం సుందర్ రెడ్డి తెలిపారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో బిజిల్లా కోపరేటివ్ డెవలప్‌మెంట్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఫంక్షనల్ కోపరేటివ్ సంస్థలు వాటి సామర్థ్యాన్ని మెరుగు పరచుకోవాలని తెలిపారు. కోపరేటివ్ ద్వారా జిల్లాలో 19,500 మెట్రిక్ టన్నుల సామర్థ్యం గల గోడౌన్ స్పేస్ అందుబాటులో ఉందని, మార్కెటింగ్ ఎడి తో మాట్లాడుకుని, ఈ స్పేస్ ను వినియోగం లోకి వచ్చేలా చూడాలని డి.సి.ఓ రమేష్ కు సూచించారు. సమావేశంలో జె.సి సేదు మాధవన్, వ్యవసాయ, మత్స్య, పశు సంవర్ధక, చేనేత, అబ్కారీ శాఖలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.

కన్న కూతురిపై అత్యాచార యత్నం
తండ్రికి ఐదేళ్ల జైలు

ప్రజాశక్తి- కంటోన్మెంట్

బొబ్బిలి పట్టణం ఇందిరమ్మ కాలనీలో కుమార్తెపై అఘాయిత్యానికి యత్నించిన తండ్రికి పోక్సో ప్రత్యేక కోర్టు న్యాయమూర్తి కె.నాగమణి ఐదేళ్ల జైలు శిక్ష విధించారు. బాధితురాలికి పరిహారంగా రూ.50వేలు మంజూరు చేస్తూ తీర్పు చెప్పారు. బొబ్బిలి పట్టణం ఇందిరమ్మ కాలనీలో నివాసం ఉంటున్న కాసా నర్సింగరావు (42) 2024 జూలై 19న ఇంట్లో ఎవరూ లేని సమయంలో నిద్రిస్తున్న తన 11ఏళ్ల కుమార్తెపై లైంగిక దాడికి యత్నించినట్లు బాలిక అమ్మమ్మ బొబ్బిలి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఎస్ఐ ఎం.నాగేశ్వరరావు నిందితుడిని అరెస్టు చేసి, రిమాండుకు తరలించారు. అనంతరం, బొబ్బిలి సిఐ కె.సతీష్ కుమార్ కేసు దర్యాప్తు చేపట్టారు. నేరం రుజువు కావడంతో నర్సింగరావుకు ఐదేళ్ల జైలు శిక్ష, రూ.2వేలు జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు. బాధితురాలికి పరిహారంగా రూ.50 వేలును మంజూరు చేస్తూ తీర్పును వెల్లడించారు. పోలీసుల తరుపున ఫోక్సో కోర్టు ఇన్చార్జ్ పబ్లిక్ ప్రాసిక్యూటరు ఎం.ఖజానారావు వాదనలు వినిపించారు. ఈ కేసులో క్రియాశీలకంగా పని చేసిన పోలీసు అధికారులను ఎస్‌పి ఎఆర్ దామోదర్ అభినందించారు.

విద్యార్థులను అభినందిస్తున్న డిఇఒ మాణిక్యం నాయుడు

బాక్సింగ్‌లో జిల్లాకు నాలుగు రాష్ట్ర స్థాయి మెడల్స్

ప్రజాశక్తి-విజయనగరంటౌన్

ఇటీవల రాజమండ్రిలో జరిగిన స్కూల్ గేమ్స్‌లో జిల్లా నుండి అండర్ 14, అండర్ 17, అండర్ 19 కేటగిరీ బాక్సింగ్ పోటీల్లో జిల్లాకు చెందిన విద్యార్థులు నాలుగు రాష్ట్రస్థాయి మెడల్స్ సాధించారు. అండర్ -17 లో పి. దుర్గాప్రసాద్ (46 కేజీలు విభాగం), బి.సచిన్ (75 కేజీలు విభాగం) బంగారు పతకాలు సాధించి జాతీయ స్థాయికి ఎంపికయ్యారు. వీరిద్దరూ ఈనెల 28 నుండి అరుణాచల్ ప్రదేశ్ లో జరగనున్న జాతీయస్థాయి బాక్సింగ్ పోటీలకు వెళ్లన్నారు. అండర్ 19 కేటగిరీలో హేమేస్ వర్ధన్ రెడ్డి 46 కేజీల విభాగం, ఎస్.యశ్వంత్ 60 కేజీల విభాగంలో రాష్ట్రస్థాయి బంగారు పతకాలు సాధించి జాతీయ స్థాయికి ఎంపికయ్యారు. వీరిద్దరూ త్వరలో కర్ణాటకలో జరగనున్న జాతీయస్థాయి బాక్సింగ్ పోటీలకు హాజరుకానున్నారు. వీరు బుధవారం కలెక్టర్ ఎస్ రాంసుందర్ రెడ్డిని కలిశారు. ఈ సందర్భంగా విద్యార్థులను, కోచ్ ఈశ్వరరావును డిఇఒ యు.మాణిక్యం నాయుడు, హెచ్‌ఎం అసోసియేషన్ కార్యదర్శి సన్యాసిరాజు, స్కూల్ గేమ్స్ కార్యదర్శులు గోపాల్, విజయలక్ష్మి అభినందించారు.

మెడికల్ కాలేజీలో మౌలిక సదుపాయాలు కల్పించాలి

ముఖ్యమంత్రికి ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక లేఖ

ప్రజాశక్తి- కంటోన్మెంట్

జిల్లాకేంద్రంలోని ప్రభుత్వ వైద్య కళాశాలలో మౌలిక సదుపాయాలు కల్పించాలని ఉత్తరాంధ్ర అభివృద్ధివేదిక ఆర్గనైజింగ్ కార్యదర్శి ఎం.శ్రీనివాస ముఖ్యమంత్రి చంద్రబాబుకు లేఖ రాశారు. కాలేజి అభివృద్ధి, తగినంత మంది టీచింగ్, నాన్ టీచింగ్ సిబ్బంది నియామకం, మౌలిక సదుపాయాల అభివృద్ధి, ఇతర సమస్యల పరిష్కారం కోసం తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు. రూ.7500 కోట్ల వ్యయంతో సుమారు 70 ఎకరాల విస్తీర్ణంలో ప్రథమ దశ పనులు పూర్తయ్యే దశకు చేరుకున్నాయని లెటర్‌లో వివరించారు. ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక ప్రతినిధి బృందం కాలేజీ పరిస్థితులను స్వయంగా వెళ్లి పరిశీలించిందని తెలిపారు. కళాశాల సమగ్ర అభివృద్ధి కోసం కొన్ని అత్యవసర అంశాలపై త్వరిత చర్యలు అవసరమని కోరారు. టీచింగ్ హాస్పిటల్ నిర్మాణం త్వరితగతిన పూర్తిచేయాలని, క్యాంపస్‌లో 5వందల పడకల సామర్థ్యం గల సూపర్ స్పెషాలిటీ బ్లాక్ నిర్మాణాన్ని ప్రతిపాదించాలని కోరారు.

ఉత్సాహంగా జెఎన్‌టియు ఫ్రెషర్స్‌డే

విజయనగరం టౌన్ : జెఎన్‌టియు గురజాడలో బుధవారం ఫ్రెషర్స్ డే ఉత్సవాలు ఘనంగా జరిగాయి. ముఖ్యఅతిథిగా వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ వివి సుబ్బారావు మాట్లాడుతూ సాంప్రదాయ విద్యా విధానాలకు ఇప్పుడు ఉన్న ఆధునిక విద్యా విధానానికి ఉన్న తేడాను వివరిస్తూ బిటెక్ విద్యలో ప్రతి సంవత్సరం ఒక ప్రాజెక్టు కంప్లీట్ చేసే విధంగా విద్యను అభ్యసించాలని అన్నారు. విద్యార్థులకు మౌలిక సదుపాయాలు, లేబొరేటరీ సదుపాయాలు కల్పిస్తామన్నారు. సెల్ఫ్ లెర్నింగ్ తో పాటు లిజనింగ్ స్కిల్స్ పెంచుకున్న విద్యార్థులు మరో సుందరపిచ్చయ్ కాగలరని అన్నారు. కార్యక్రమంలో యూనివర్సిటీ రిజిస్టర్ జయసుమ, ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఆర్.రాజేశ్వరరావు ,వైస్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ జిజె నాగరాజు , బేసిక్ సైన్సెస్ హెచ్ఒడి డాక్టర్ సౌభాగ్యలక్ష్మి, ఇతర అధ్యాపక సిబ్బంది పాల్గొన్నారు.

సచివాలయం వద్ద నిరసన

బొండపల్లి : జల జీవన్ మిషన్ ద్వారా ఇంటింటికీ కుళాయి కనెక్షన్లు ఇచ్చేందుకు తవ్విన రోడ్లను మధ్యలోనే వదిలేయడంతో గొల్లుపాలెం సచివాలయం వద్ద సిపిఎం ఆధ్వర్యాన బుధవారం నిరసన తెలిపారు.సిపిఎం నాయకులు టి.పైడిపునాయుడు ఆధ్వర్యాన సచివాలయంలోకి వెళ్లి నిరసన తెలిపారు. తవ్విన రోడ్లను మధ్యలోనే వదిలి వేయడంతో ఇళ్ళ ముందు చెత్త పోగుపడి చాలా ఇబ్బందులు పడుతున్నారని, రాకపోకలకు ఇబ్బంది కలగడమే కాకుండా ఈగలు, దోమలు ఎక్కువై అనారోగ్యం పాలవుతున్నారని, సమస్యను పరిష్కరించాలని ఆయన డిమాండ్ చేశారు. సచివాలయం కార్యదర్శికి వినతి అందజేశారు. వెంటనే ఆయన ఆర్‌డబ్ల్యుఎస్ ఇంజినీర్‌తో మాట్లాడగా రెండు రోజుల్లోచర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో పి.సత్యం, టి.సత్యం ఈదిబిల్లి అప్పారావు, కొల్లి అప్పలనాయుడు, గొర్రెల సత్యం, బోగాడ రాములమ్మ తదితరులు పాల్గొన్నారు.

జ్వరమొస్తే మంత్రిది బాధ్యతా?

- జ్వరాలపై వైసిపి శవ రాజకీయం
- గిరిజన సంక్షేమశాఖ మంత్రి సంధ్యారాణి
- రహదారుల నిర్మాణానికి శంకుస్థాపన

రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న మంత్రి సంధ్యారాణి

ప్రజాశక్తి-మెంటాడ

రాష్ట్రంలోని అన్ని సంక్షేమ వసతి గృహాల్లోను విద్యార్థులకు జ్వరం, జలుబు, పచ్చకామెర్లు ఉన్నాయని, ఎవరికైనా జ్వరమొస్తే మంత్రిది బాధ్యతా? అని గిరిజన సంక్షేమశాఖా మంత్రి గుమ్మడి సంధ్యారాణి అన్నారు. ఇటీవల కురుపాం, సాలూరు మండలాల్లో జ్వరాలు, పచ్చకామెర్లతో విద్యార్థులు మృతి చెందిన ఘటనపై ఆమె స్పందిస్తూ పై వ్యాఖ్యాలు చేశారు. మండలంలోని కొండలింగాలవలస నుంచి గజంగుడ్డి వలస గ్రామాల మధ్య 2 కోట్ల 35 లక్షల రూపాయలతో మంజూరైన రహదారి పనులకు మంత్రి సంధ్యారాణి బుధవారం శంకుస్థాపన చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మంత్రి మాట్లాడుతూ సమాజాభివృద్ధికి, నాగరికత విస్తరణకు దోహదపడే రహదారి వ్యవస్థపై కూటమి ప్రభుత్వం దృష్టి సారించిందని, అందులో భాగంగా గిరిజన గ్రామాలకు రహదారి సౌకర్యం కల్పిస్తామని మంత్రి అన్నారు. రహదారి సౌకర్యం లేని గిరిజన గ్రామం ఉండరాదనే కృతనిశ్చయంతో ఉన్నామన్నారు. ఐదేళ్ల విధ్వంస పాలనతో రాష్ట్రాన్ని 20 ఏళ్ల వెనక్కి నెట్టేసిన వైసిపి ముఠాకు 11 స్థానాలతో ప్రతిపక్ష హోదాకూడా లేకుండా చేసినా వారి తీరుమారడం లేదని విమర్శించారు. పిల్లల జ్వరాలతో రాజకీయం చేయడం వైసిపి వారికి తగదని అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని సంక్షేమ హాస్టళ్లలోను, గ్రామాల్లోను జ్వరాలు, పచ్చకామెర్లు ఉన్నాయని, ఎవరికైనా జ్వరమొస్తే మంత్రిది బాధ్యతా అని ప్రశ్నించారు. మంత్రి గాడిదలు కాస్తోందా అని తనను ఉద్దేశించి జగన్ రెడ్డి చేసిన వ్యాఖ్యలకు మంత్రి స్పందిస్తూ కూటమి దెబ్బకు మూలకుచేరి గాడిదలు కాస్తున్నదెవరో చేస్తున్న ప్రజలకు తెలుసని ఎద్దేవా చేశారు. గాడిదలాంటి బుద్ధి నీదేనని సంధ్యారాణి కౌంటర్ ఇచ్చారు. వైసిపి హయాంలో ఇక్కడ మంత్రులు, ఉప ముఖ్యమంత్రులుగా పనిచేసిన రాజన్నదొర, పుష్పశ్రీ వాణి అప్పట్లో విష జ్వరాలు వ్యాప్తి చెందితే కనీసం పట్టించుకోలేదని విమర్శించారు. మెంటాడ మండలం పెడమేడపల్లి ముఠా ఛానల్ అభివృద్ధికి 40 లక్షలు మంజూరైనట్టు చెప్పారు. కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షులు చలుమూరి వెంకటరావు, కొండ లింగాల వలస ఎంపిటిసి గుమ్మిడి ప్రవీణ్, నాయకులు గెద్ద అన్నవరం, గుమ్మిడి వెంకన్న,రెడ్డి ఆదినారాయణ, రెడ్డి ఎర్రినాయుడు, జనసేన నాయకుడు చింత కాశీ నాయుడు తదితరులు పాల్గొన్నారు

సర్దార్ @150లో యువత భాగస్వామ్యం కావాలి : ఎమ్‌పి

ప్రజాశక్తి-విజయనగరంకోట

ఉక్కు మనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతిని పురస్కరించుకొని భారత ప్రభుత్వం చేపట్టిన సర్దార్ @150 కార్యక్రమాలలో యువత భాగస్వామ్యం కావాలని ఎమ్‌పి కలిశెట్టి అప్పలనాయుడు పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక నెహ్రూ యువ కేంద్రం లో జరిగిన పాత్రికేయుల సమావేశంలో ఎమ్‌పి మాట్లాడారు. అక్టోబర్ 31 నుండి నవంబర్ 25 వరకు జరగనున్న ర్యాలీలు, వివిధ రకాల పోటీలలో విద్యార్థులు, యువత పాల్గొనాలని తెలిపారు. యూనిటీ మార్చ్‌ను విజయనగరం పార్లమెంట్ నియోజకవర్గంలో రెండు చోట్ల చేపట్టాలని సూచించారు. యువతలో సర్దార్ వల్లభాయ్ పటేల్ గారి ఆశయాలను తీసుకువెళ్లాలని ఉద్దేశంతో ఈ యూనిటీ మార్చ్ జరుగుతుందని తెలిపారు. సర్దార్ వల్లభాయ్ పటేల్ జన్మ స్థానం అయిన కరంసాద్ నుండి 152 కిలోమీటర్ల ర్యాలీ లో ప్రతి జిల్లా నుండి ఇద్దరు యువకులు పాల్గొనేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా యూనిటీ మార్చ్ పోస్టర్లను ఎంపి ఆవిష్కరించారు. సమావేశంలో జిల్లా యువజన అధికారి ప్రేమ్ భరత్ కుమార్, జెఎన్‌టియు జివి ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ మణికుమార్, సెట్విజ్ మేనేజర్ కెవి రమణ, మై భారత్ సంచాలకులు శ్రీనివాస్, రెడ్ క్రాస్ చైర్మన్ కెఆర్‌డి ప్రసాదరావు, డిపిఆర్ఒ గోవిందరాజులు, నేషనల్ యూత్ వాలంటీర్స్ పాల్గొన్నారు.

కుళాయి పైపు లైన్ల పరిశీలన

ప్రజాశక్తి వార్తకు స్పందన

ప్రజాశక్తి-విజయనగరం కోట

'నీరు ఇలా ఉంటే రోగాలు రావా? అనే శీర్షికతో ప్రజాశక్తిలో ప్రచురితమైన వార్తకు మున్సిపల్ వాటర్ వర్క్స్ అధికారులు స్పందించారు. ఎఇ రవి, ఫిట్టర్, లైన్ మెన్ కలిసి బుధవారం విటి అగ్రహారం చేరుకొని కుళాయి పైపులైన్లు పరిశీలించారు. కుళాయి గోతుల్లో నిల్వ ఉన్న నీరు రివర్స్‌లో కుళాయి పైపుల్లోకి వెళ్లడం వల్ల సమస్య ఉన్నట్లు గుర్తించారు. ఈ సందర్భంగా ఎఇ మాట్లాడుతూ పైప్ లైన్లు నిరంతరం పర్యవేక్షించాలని సంబంధిత వ్యక్తులకు ఆదేశాలు ఇచ్చారు. ఇటువంటి సమస్యలు ఇకపై తలాత్తకుండా చూడాలన్నారు.

చదువుకు చేయూత

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

రఘు ఇంజినీరింగ్ కాలేజీలో బి.టెక్ చదువుతూ ఆర్థికంగా వెనుకబడిన ఎస్. మధులత కు బస్సు ఫీజు నిమిత్తం రూ 30 వేల రూపాయల సహాయాన్ని చారిటీ గ్రూప్ అందజేసింది. ఈ సందర్భంగా ఆ గ్రూపు అధ్యక్షులు ఆలవెల్లి శేఖర్ మాట్లాడుతూ విద్య, వైద్యం, వివాహం గురించి చేయూత నిచ్చేందుకు గ్రూప్ సిద్ధంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో కార్యదర్శి డిమ్స్ రాజు, కోశాధికారి సముద్రాల నాగరాజు,వాసవి క్లబ్ అధ్యక్షులు విజ్జపు విజయ్,కష్ణారావు, కుమార్, జనార్ధనారావు, తదితరులు పాల్గొన్నారు.

ప్రజా అవసరాలకు అనుగుణంగా పని చేయాలి : కోలగట్ల

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నూతనంగా నియమితులైన అనుబంధ కమిటీల సభ్యులు ప్రజల అవసరాలకు అనుగుణంగా పనిచేయాలని మాజీ డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి అన్నారు. అనుబంధ కమిటీలతో బుధవారం తన నివాసంలో వైసిపి పట్టణ అధ్యక్షులు ఆశపు వేణు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో కోలగట్ల మాట్లాడారు. పార్టీ సిద్ధాంతాలను అనుసరించి, ప్రజల్లోకి తీసుకు వెళ్లి, పార్టీ పట్ల ఆకర్షితులను చేయగలరని.. పార్టీ అధికారంలో ఉన్న, లేకున్నా ప్రజల అవసరాలను గుర్తించి, ఇచ్చిన పదవితో ప్రజలకు ఏ విధమైన మేలు చేయాలని ఆలోచన చేయగలిగే వాడే నిజమైన నాయకుడని అన్నారు. అనంతరం వైసిపి మహిళా విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, నగర డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి శ్రావణిని, నూతన కమిటీ సభ్యులను అభినందించారు. మున్సిపల్ ఫ్లోర్ లీడర్ ఎస్.వి.వి రాజేష్, వైసిపి జిల్లా ప్రధాన కార్యదర్శి సంఘం రెడ్డి బంగారు నాయుడు తోపాటు నగర కమిటీ, అనుబంధ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

విద్యుత్తుశాఖ ఎస్‌ఇకి సన్మానం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఎస్‌ఇ లక్ష్మణరావును సత్కరిస్తున్న ఉద్యోగులు

ఇటీవల స్వచ్ఛ అవార్డు పొందిన విద్యుత్ శాఖ సూపరింటెండెంట్ ఇంజినీర్ ముువ్వల లక్ష్మణరావును కార్యాలయ అధికారులు, ఉద్యోగులు ఘనంగా బుధవారం సత్కరించారు. కార్యాలయం తో పాటు, జిల్లాలో విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో స్వచ్ఛంద్ర కార్యక్రమం విజయవంతంగా నిర్వహించేందుకు చేస్తున్న కృషిని అభినందిస్తూ ముఖ్యమంత్రి చేతుల మీదుగా అవార్డు తీసుకున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో కార్యాలయంలో ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ లు పి.త్రినాధరావు, సురేష్ బాబు ఆధ్వర్యంలో డిఇలు, విజిలెన్స్ అధికారులు, ఉద్యోగులు శాలువ కప్పి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఎస్‌ఇ లక్ష్మణరావు మాట్లాడుతూ మీ అందరి సహకారంతో అవార్డు వచ్చిందన్నారు. ఇదే స్ఫూర్తితో ప్రజలకు విద్యుత్ సేవలు అందించడంలో అధికారులు, ఉద్యోగులు సహకరించాలని కోరారు.

జాబ్‌మేళాలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అదితి విజయలక్ష్మి

అవకాశాలను అంది పుచ్చుకోవాలి : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-విజయనగరం కోట, టౌన్

నిరుద్యోగ యువత అందుబాటులో ఉన్న ఉపాధి అవకాశాలను అంది పుచ్చుకోవాలని విజయనగరం ఎమ్మెల్యే పూసపాటి అదితి విజయలక్ష్మి గజపతిరాజు అన్నారు. బుధవారం మెసానిక్ మెకానిక్ టెంపుల్‌లో మెప్మా, ఆంధ్రప్రదేశ్ నైపుణ్య సంస్థ సంయుక్తంగా నిర్వహించిన జాబ్ మేళాను ఎమ్మెల్యే ప్రారంభించారు. సుమారు 19వందల మంది నిరుద్యోగులు 15 కంపెనీల్లో ఉద్యోగాల కోసం దరఖాస్తు చేసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు విజన్ 2047, ప్రధానమంత్రి నరేంద్ర మోడీ వికసిత్ భారత్ లో భాగంగా జాబ్ మేళాను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మెప్మా పీడీ జి.వి.చిట్టి రాజు మాట్లాడుతూ ఈ జాబ్ మేళాలో ఒక్కో అభ్యర్థి 6 కంపెనీలకు రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చు అన్నారు. జాబ్ మేళాలో ఉద్యోగాలు పొందిన వారే కాకుండా, రాని వారు కూడా నిరాశ పడవద్దని అన్నారు. మరో నాలుగు జాబ్ మేళాలు నిర్వహిస్తామన్నారు. హ్యూమన్ డెవలప్మెంట్ సంస్థ మేనేజర్ కార్తీక్ మాట్లాడుతూ ఇప్పటి వరకు తమ సంస్థ ద్వారా 3లక్షల 13వేల మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో కమిషనర్ నల్లనయ్య టిడిపి పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఐవిపి రాజు, పట్టణ అధ్యక్షులు గంటా రవి, మండల పార్టీ కార్యదర్శి పాశి అప్పలనాయుడు, అవనాపు విజయ్ తదితరులు పాల్గొన్నారు.

కానిస్టేబుళ్ల శిక్షణకు ఏర్పాట్లు : ఎస్‌పి

ప్రజాశక్తి- కంటోన్మెంట్

పోలీసు శిక్షణకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని పోలీసు అధికారులకు ఎస్‌పి ఎఆర్ దామోదర్ ఆదేశించారు. సారిపల్లిలోని పోలీసు శిక్షణ కేంద్రాన్ని బుధవారం ఆయన పరిశీలించారు. వసతులను పరిశీలించారు. సారిపల్లిలో గల డిపిటిసిలో ట్రైనీ కానిస్టేబుళ్లకు క్రమశిక్షణతో కూడిన శిక్షణను అందించేందుకు మౌలిక వసతులు, ఏర్పాట్లును త్వరితగతిన చేపట్టాలన్నారు. శిక్షణకు వచ్చే కానిస్టేబుళ్ళుకు క్రమశిక్షణతో కూడిన ఉత్తమ శిక్షణను అందించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. శిక్షణ కేంద్రంలో మంచాలు, పరుపులు, క్రీడా సామగ్రి, టేబుల్స్, కంప్యూటర్లు, ఫ్యానులను పరిశీలించారు. అనంతరం, శిక్షణ ఇచ్చేందుకు నియమితులైన పోలీసు అధికారులు, సిబ్బందితో ఎస్‌పి సమావేశమై పలు సూచనలు చేశారు. ఎఎస్‌పి పి.సౌమ్యలత, డిపిటిసి డిఎస్‌పి ఎం.వీరకుమార్, డిపిటిసి సిఐలు, ఎస్‌ఐలు పాల్గొన్నారు.

పేదల ఆకలి తీర్చడం అదృష్టం

బొబ్బిలి : పేదల ఆకలి తీర్చడం అదృష్టమని ఎమ్మెల్యే బేబినాయన అన్నారు. పట్టణంలోని మార్కెట్ రామాలయంలో కళింగ వైశ్య సంఘం ఆధ్వర్యంలో పేదలకు ఆహార పొట్లాలు పంపిణీ చేశారు. పేదల ఆకలి తీర్చడం అదృష్టమన్నారు. పేదలకు కళింగ వైశ్య సంఘం అండగా ఉండడం ఆనందంగా ఉందన్నారు. కళింగ వైశ్య సంఘం అధ్యక్షులు గెంబలి శ్రీనివాసరావు మాట్లాడుతూ నిత్య అన్నదానం చేసి పేదల ఆకలి తీరుస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రాంబార్కి శరత్ బాబు, కళింగ వైశ్య సంఘం సభ్యులు, టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గ్రంథాలయాల అభివృద్ధికి కృషి

రామభద్రపురం: కూటమి ప్రభుత్వం గ్రంథాలయాల అభివృద్ధికి విశేష కృషి చేస్తుందని ఆంధ్రప్రదేశ్ గ్రంథాలయ పరిషత్ మెంబర్ రౌతు రామ్మూర్తినాయుడు తెలిపారు. స్థానిక గ్రంథాలయాన్ని బుధవారం జిల్లా గ్రంథాలయ కార్యదర్శి లక్ష్మీతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ గ్రంథాలయ అభివృద్ధి కోసం కృషి చేస్తున్నారన్నారు. ముఖ్యంగా రాష్ట్రంలోని గ్రంథాలయాల్లో ప్రధాన సమస్య అయిన జీరో అకౌంట్ ద్వారా సిబ్బంది జీతాలు, నూతన సిబ్బంది నియామకాలకి, భవనాల మరమ్మతులకు, నూతన భవనాల నిర్మాణానికి, గ్రంథాలయాలలో పోటీ పరీక్షల పుస్తకాల కొనుగోలుకు ముఖ్యమంత్రి, విద్యాశాఖ మంత్రి దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం చేసేందుకు కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో లైబ్రేరియన్ సత్యవతి, జిల్లా గ్రంథాలయ సిబ్బంది, బాడంగి లైబ్రేరియన్ దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

బాలికల వసతి గృహాన్ని ప్రారంభించాలి

రేగిడి: మండలంలోని లక్ష్మీపురం బాలికల నూతన వసతి గృహాన్ని ప్రారంభించేందుకు చర్యలు తీసుకోవాలని ఎపిసమగ్ర శిక్షా ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ డాక్టర్ రామారావు స్థానిక మండల విద్యాశాఖ అధికారులకు సూచించారు. బుధవారం లక్ష్మీపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నూతనంగా నిర్మిస్తున్న బాలికల వసతి గృహాన్ని ఆయన పరిశీలించారు. వసతి గృహంలో విద్యార్థులకు కావలసిన అన్ని రకాల గదులనూ పరిశీలించారు. అక్కడ నిర్మించిన బాత్రూంలో అన్ని వసతులను క్షుణ్ణంగా పరిశీలించి పెండింగ్ పనులను పూర్తి చేయించాలని ఎంఇఒ ఎం.వర ప్రసాద్ రావుకు సూచించారు. వసతి గృహాన్ని 20 రోజుల్లో నిర్మించి విద్యాశాఖ అధికారులకు అందించాలని కాంట్రాక్టర్ గౌరు నాయుడుకు సూచించారు. వీరితో పాటు హెచ్‌ఎమ్ కృష్ణారావు పాల్గొన్నారు.

జూనియర్, డిగ్రీ కాలేజీలు ఏర్పాటు చేయాలి

బొబ్బిలి: బొబ్బిలి నియోజకవర్గం కేంద్రంలో ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కళాశాలలు లేకపోవడంతో పేద విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వెంటనే వాటిని ఏర్పాటు చేయాలని డివైఎఫ్ఐ జిల్లా నాయకులు సురేష్, విద్యార్థి యువజన జెఎసి అధ్యక్షులు సాయికిరణ్, ఎఐఎస్ఎఫ్ నాయకులు శ్రావణ్, వైసిపి యువజన నాయకులు నాని అన్నారు. బొబ్బిలిలో ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కళాశాలలు ఏర్పాటు చేయాలని కోరుతూ బుధవారం గంటి ప్రసాదం భవనంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నియోజకవర్గం ఏర్పడి 74ఏళ్ల పూర్తి అయినప్పటికీ ప్రభుత్వ కళాశాలలు లేకపోవడంతో పేద, మధ్య తరగతి విద్యార్థులు ప్రైవేట్ కళాశాలలో ఫీజు కట్టి చదవలేక విద్యకు దూరం అవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వాలు మారుతున్నా ప్రభుత్వ కళాశాలలు ఎందుకు ఏర్పాటు చేయడం లేదని ప్రశ్నించారు. పేద విద్యార్థులు కోసం తక్షణమే ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కళాశాలలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. లేనిచో ఆందోళన ఉధృతం చేస్తామన్నారు. కార్యక్రమంలో విద్యార్థులు పాల్గొన్నారు.

రీ సర్వేను వేగవంతం చేయాలి

వంగర: రీ సర్వేను వేగవంతం చేయాలని తహశీల్దార్ పిన్నింటి రామారావు అన్నారు. మండలంలోని కొప్పరలో జరుగుతున్న మూడవ దశ రీ సర్వే గ్రౌండ్ ట్రూత్ రిపోర్టును ఆయన బుధవారం పరిశీలించారు. సర్వేలో ఏమైనా సమస్యలుంటే తమ దృష్టికి తేవాలన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకొని రెవెన్యూ భూ సమస్యలు పరిష్కరించుకోవాలన్నారు. అనంతరం తహశీల్దార్ కార్యాలయంలో సర్వేయర్లతో సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో డిటి ఆర్ శ్రీనివాసరావు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

మారిక పాఠశాల దత్తత

వేపాడ: మండలంలోని మారిక ప్రాథమిక పాఠశాలను సాహసం స్వచ్ఛంద సంస్థ దత్తత తీసుకున్నట్లు ఆ సంస్థ వ్యవస్థాపకులు మాచవరపు గణేష్ తెలిపారు. లక్కవరపుకోట చందులూరు గ్రామానికి చెందిన ఆయన బుధవారం పాఠశాలను సందర్శించి దత్తతలో భాగంగా మొదటి దశలో రూ.2వేలు విలువ చేసే ఇనుప బీరువా, ఇనుప అలమరా, విద్యార్థులు కూర్చునేందుకు 30 కుర్చీలు, టేబల్, ఉపాధ్యాయులకు కుర్చీలు, నోట్ పుస్తకాలు, పెన్నులు, పెన్సిల్స్ అందించారు. గ్రామంలో విద్య, వైద్యం తాగు నీటికి ఇబ్బంది లేకుండా సౌకర్యాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు. ఆయనకి పాఠశాల ప్రధానోపాధ్యాయులు కె.రమేష్, ఉపాధ్యాయులు తాడి రాంబాబు, గ్రామస్తులు, విద్యార్థులు కృతజ్ఞతలు తెలిపారు.

వీలుపర్తిలో పశువైద్య శిబిరం

వేపాడ: మండలంలోని వీలుపర్తి గ్రామంలో బుధవారం మండల పశు వైద్యాధికారి కోరాడ గాయత్రి ఆధ్వర్యంలో పశువైద్య శిబిరం ఏర్పాటు చేశారు. శిబిరంలో రైతులకు పశువులలో గోమార్ల (పశువుల రక్తాన్ని పీల్చే చిన్న పురుగులు) వల్ల పశువులు రక్తహీనతకు గురయ్యే వాటిలో సహజసిద్ధమైన వ్యాధి నిరోధక శక్తి తగ్గిపోతుందని చెప్పారు. పాడి పశువులలో పాల ఉత్పాదక శక్తి, పని చేసే పశువులలో పని సామర్థ్యం, దూడలలో ఎదుగుదల తగ్గిపోతుందని అన్నారు. పాడి రైతులు పశువుల కొట్టంలో శుభ్రత పాటించడం, గోమార్ల నివారణ మందులు వాడటం, ఆయుర్వేద పద్ధతులు పాటించడం వల్ల గోమార్లను నివారించవచ్చని అవగాహన కల్పించారు. ఈ శిబిరంలో వేపాడ పశువైద్య చికిత్సాలయ సిబ్బంది, పశుసంవర్ధక సహాయకులు పాల్గొన్నారు.

కూటమి ప్రతిష్ట దెబ్బతీయాలనే జగన్ కుట్ర

భోగాపురం: కూటమి ప్రతిష్ట దెబ్బ తీయాలనే జగన్ కుట్ర పన్నుతున్నారని రాష్ట్ర మార్క్‌ఫెడ్ చైర్మన్, నెల్లిమర్ల నియోజకవర్గం టిడిపి ఇంచార్జ్ కర్రోతు బంగార్రాజు అన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో బుధవారం ఆయన విలేకర్ల తో మాట్లాడారు. తమ అవినీతి, అక్రమాలను ఎదుటివారిపై నెట్టడంలో జగన్ అండ్ కో పిహెచ్‌డి చేశారన్నారు. గత ఐదేళ్లలో లిక్కర్ మాఫియాతో రూ.3,500 కోట్లు దోచుకున్న విషయాన్ని ప్రజల దృష్టి మళ్లించేందుకే ఈ కుట్ర పన్నారని విమర్శించారు. గత ప్రభుత్వంలో జే బ్రాండ్ల మద్యం వల్ల వేలాది మంది ప్రాణాలు కోల్పోయారని, విషపూరిత పదార్థాలు ఉన్నట్లు ల్యాబ్‌లలో నిర్ధారణ అందని గుర్తు చేశారు. ఈ సమావేశంలో టిడిపి మండల అధ్యక్షుడు కర్రోతు సత్యనారాయణ, ఏఎంసి డైరెక్టర్ గరి వెంకటరమణ, పిడుగు తోటరావు, దాసరి అప్పలస్వామి, కోరాడ తాతారావు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఆధార్ స్పెషల్ డ్రైవ్

మెరకముడిదాం: ఈ నెల 23వ తేదీ నుంచి 30వ తేదీ వరకు పాఠశాల, కళాశాల విద్యార్థులకు మ్యాండేటరీ బయోమెట్రిక్స్ (ఆధార్ స్పెషల్ డ్రైవ్) నిర్వహిస్తామని ఎంపిడిఒ జి.భాస్కరరావు తెలిపారు. గురువారం గర్భాం గ్రామ సచివాలయంలో ఈ స్పెషల్ డ్రైవ్ కార్యక్రమాన్ని ప్రారంభిస్తామన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకునే విధంగా పాఠశాల ఉపాధ్యాయులు, కళాశాల అధ్యాపకులు విద్యార్థులకు అవగాహన కల్పించాలన్నారు.

ఉపాధ్యాయ అవతారమెత్తిన డిఇఒ

డెంకాడ: జిల్లా విద్యాశాఖాధికారి యు.మాణిక్యంనాయుడు ఉపాధ్యాయ అవతారమెత్తారు. బుధవారం మండలంలోని అక్కివరం జిల్లా పరిషత్ హై స్కూల్‌ను సందర్శించారు. ఇందులో భాగంగా పదో తరగతి విద్యార్థుల విద్యా ప్రమాణాలను పరిశీలించారు. వచ్చే సమ్మేటివ్ అసెస్మెంట్-1 పరీక్షలకు విద్యార్థులు సమర్థవంతంగా తయారవ్వేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని సూచించారు. తరువాత ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించి విద్యార్థుల విద్యా ప్రగతిని మెరుగుపరచడానికి అనుసరించవలసిన తరగతి అభ్యసన పద్ధతులు, పునరావృత పరీక్షలు నిర్వహించటం, బలహీన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి పెట్టడం వంటి అంశాలను చర్చించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గ్రామ సభల ద్వారా ఉపాధి పనులు గుర్తించాలి

రేగిడి: గ్రామస్థాయిలో ఉపాధి వేతనదారులకు 2026-27 ఏడాదికి సంబంధించి గ్రామ సభల ద్వారా పనులు గుర్తించి, ఉపాధి కల్పించేలా చర్యలు తీసుకోవాలని ఎపిడి చంద్రకుమారి సూచించారు. ఉపాధి కార్యాలయంలో ఫీల్డ్ అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్లతో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉపాధి వేతనదారులకు సరిపడా పనులు గుర్తించి వారికి పనులు కల్పించేలా గ్రామసభలు ఏర్పాటు చేయాలన్నారు. ఉపాధి శ్రామికులకు ఆధార్, జాబు కార్డుకు ఇకెవైసి తప్పనిసరిగా చేయించాలన్నారు. ఎపిఒ సంకాబత్తుల హరినాథ్ మాట్లాడుతూ మండలంలో 30,643 ఉపాధి శ్రామికులున్నారని ఇప్పటి వరకు 20,920 మందికి ఇకెవైసి చేసినట్లు వెల్లడించారు. సమావేశంలో ఎంపిడిఒ శ్యామల కుమారి ఉన్నారు.

పార్టీకి పూర్వవైభవం తేవాలి : బడ్డుకొండ

ప్రజాశక్తి - డెంకాడ

నియోజకవర్గంలో పార్టీ పదవులు పొందిన వారందరూ పార్టీ అభివృద్ధికి కృషి చేసి పూర్వ వైభవం తేవాలని మాజీ ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు కోరారు. నియోజకవర్గంలోని వివిధ స్థాయిల్లో పార్టీ పదవులు పొందిన వారందరూ మోపాడలోని ఆయన స్వగృహంలో బుధవారం కలిసి ఆయనకు కృతజ్ఞతలు తెలిపి సత్కరించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామస్థాయిలో కూడా పార్టీ అభివృద్ధికి కృషి చేయాలన్నారు. నియోజకవర్గంలో 6వేల మందితో కమిటీలు వేయాలన్నారు. ప్రస్తుతం 1500 నుంచి 2వేల మంది వరకు కమిటీలు వేశామని మిగిలిన 4వేల మందిని గ్రామ కమిటీల్లో వేయాలని సూచించారు. ప్రతి గ్రామంలో 10 కమిటీలు కమిటీకి పది మంది చొప్పున వేయాలన్నారు. ఈ నెల 28వ తేదీన నియోజకవర్గ స్థాయిలో నెల్లిమర్లలో మొయిద జంక్షన్ నుంచి రామతీర్థం జంక్షన్ వరకూ మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ పై భారీ ర్యాలీ నిర్వహిస్తామని ఈ ర్యాలీకి ప్రతి ఒక్కరూ హాజరు కావాలని కోరారు.



మాజీ ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు చెబుతున్న నాయకులు

వైసిపి మండల అధ్యక్షులుగా పిన్నింటి

వైసిపి మండల అధ్యక్షుడిగా పిన్నింటి తమ్మి నాయుడు, ఉపాధ్యక్షుడిగా బమ్మిడి వెంకటరమణ, సరగడ రాము రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా బడ్డుకొండ శంకర్ ప్రసాద్, తొత్తడ శ్రీనివాసరావు, బాలి సత్యనారాయణ, రొంగలి గోపాలకృష్ణ, కార్యదర్శులుగా వి.రమణ, పాండ్రంగి ఆదినారాయణ, అట్టాడ సత్యనారాయణ, త్రిపరగిరి మురళి మరి కొంతమంది కమిటీ సభ్యులుగా పార్టీ ప్రకటించింది. నియోజకవర్గ యూత్ వింగ్ అధ్యక్షుడిగా బడ్డుకొండ ప్రదీప్ నాయుడు, వైసిపి బీసీ సెల్ అధ్యక్షులుగా కోరాడ కోటినాయుడు, నియోజకవర్గ పంచాయతీరాజ్ వైసిపి అధ్యక్షునిగా బడ్డుకొండ రమేష్ నాయుడు, నియోజకవర్గ బూత్ కమిటీ అధ్యక్షుడిగా సారిక గౌరీ శంకర్, నియోజకవర్గ సోషల్ మీడియా కార్యదర్శిగా పిల్ల చిరంజీవిని ఎంపిక చేశారు.

ఎంపిపి పదవి నేను పెట్టిన భిక్ష

బంటుపల్లి వెంకట వాసుదేవరావుకు ఎంపిపి పదవి తాను పెట్టిన భిక్ష అని ఆ పదవికి రాజీనామా చేసి మాట్లాడాలని మాజీ ఎమ్మెల్యే అప్పలనాయుడు విమర్శించారు. ఇటీవల భోగాపురంలో విలేకరుల సమావేశంలో బంటుపల్లి వాసుదేవరావు మరి కొంతమంది జనసేన నాయకులు ఆ పార్టీ కార్యాలయంలో తనను విమర్శించడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. రాజకీయ బ్రోకర్ పనులు చేయడం కోసం ఐదు పార్టీలు మారిన వ్యక్తి తనను విమర్శించడమా అని ప్రశ్నించారు. ఎన్ని పార్టీలు మారినా వాసుదేవరావును ఎవరూ గుర్తించలేదని తాను గుర్తించి ఎంపిపి పదవి కట్టబెట్టానని అన్నారు. ఎన్నికల ముందు డబ్బులకు అమ్ముడుపోయి పార్టీకి ద్రోహం చేసిన వ్యక్తి అని ఆరోపించారు. ఈ సమావేశంలో పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి సైన్స్ ప్రతిభా పోటీల కోఆర్డినేటర్‌గా బంగారయ్య

ప్రజాశక్తి - నెల్లిమర్ల

జరజాపుపేట జడ్‌పి ఉన్నత పాఠశాల గణిత ఉపాధ్యాయులు శిక్షకు బంగారయ్య కౌశల్-2025 రాష్ట్ర స్థాయి సైన్స్ ప్రతిభా పోటీలకు జిల్లా కోఆర్డినేటర్‌గా ఎంపికైనట్లు బుధవారం ఆయన తెలిపారు. ఈ పోటీలు బివిఎం, ఎపి సైన్స్ సిటీ, ఎపి కాస్ట్ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్నారన్నారు. 8, 9, 10వ తరగతి విద్యార్థులు పాల్గొనవచ్చునని తెలిపారు. నవంబరు 27, 28వ తేదీ నుంచి డిసెంబర్ 27 తేదీ వరకూ తిరుపతి నేషనల్ సంస్కృత యూనివర్సిటీలో జరుగుతాయని చెప్పారు. విజేతలకు నగదు బహుమతులు, ప్రశంసా పత్రాలు ఇస్తారని పోటీల్లో పాల్గొనే వారు ఈ నెల 24న www.bvmap.org, www.bvsvb.org.in వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోవాలని ఇతర సమాచారం తనకు 9494331570, జాయింట్ కోఆర్డినేటర్ డోల శంకరరావు 8919245517 నెంబర్లు సంప్రదించాలని కోరారు.

పాడి రైతులు అప్రమత్తంగా ఉండాలి

పశు గణాభివృద్ధి సంస్థ డిప్యూటీ డైరెక్టర్ రాధాకృష్ణ

ప్రజాశక్తి - రామభద్రపురం

గర్భకోశ వ్యాధులపై పాడి రైతులు అప్రమత్తంగా ఉండాలని పశుగణాభివృద్ధి సంస్థ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ జి.రాధాకృష్ణ కోరారు. మండల పరిధిలోని నాయుడువలస గ్రామంలో బుధవారం ఉచిత గర్భకోశ వ్యాధుల చికిత్సా శిబిరాన్ని నిర్వహించి రైతులకు అవగాహనా సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏడాదికి ఒక దూడ పుట్టాలనే లక్ష్యంతో పశుగణాభివృద్ధి సంస్థ పనిచేస్తుందని తెలిపారు. సకాలంలో గర్భకోశ వ్యాధులను గుర్తించి నివారణకు చర్యలు తీసుకోవాలని సూచించారు. జిల్లాలో ఇప్పటివరకు పశుగణాభివృద్ధి సంస్థ ద్వారా 16 గర్భకోశ వ్యాధుల శిబిరాలు నిర్వహించామని తెలిపారు. ఎదను గుర్తించకపోవడం, అండాశయంలో వ్యాధులు, ఇతర వ్యాధులను నయం చేయడానికి ఈ శిబిరం ఎంతగానో ఉపయోగపడుతుందని తెలిపారు. నవంబరు 15 తరువాత ఆడదూడల ప్రదర్శన, ఉత్తమ దూడలకు బహుమతులు ఇవ్వనున్నట్లు తెలిపారు. వ్యాధి నిర్ధారణా ప్రయోగశాల ప్రతినిధి డాక్టర్ హిమజ మాట్లాడుతూ పశువు ఆరోగ్యంగా ఉంటేనే పాల దిగుబడి వస్తుందని టీకాలు సకాలంలో వేసుకోవాలని, దీని వల్ల పాడి పశువుల్లో వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందని, జబ్బులు రాకుండా ఉండేందుకు ఎంతగానో ఉపయోగపడుతుందని చెప్పారు. అనంతరం రైతులకు మినరల్ మిక్చర్ ప్యాకెట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పశువైద్యశాఖ ఎడి విష్ణు, పశువైద్యాధికారులు అప్పలనాయుడు, సురేష్‌కుమార్, బాగ్యరాజా, జగన్, గ్రామ సర్పంచ్ నడిమింటి లక్ష్మి పాల్గొన్నారు.

పెదమేడపల్లిలో మెడికల్ క్యాంప్

మెంటాడ: మండలంలోని పెదమేడపల్లి గ్రామంలో గైరమ్మ సంబరాల సందర్భంగా రెడ్డివీధి యువత, మాతృభూమి సేవా సంఘం సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం మెగా మెడికల్ క్యాంప్ ఘనంగా నిర్వహించారు. ఈ వైద్య శిబిరంలో క్వీన్స్ ఎన్ఆర్ఐ హాస్పిటల్, గాయత్రి కంటి ఆసుపత్రి, ఎన్‌విఎన్ బ్లడ్ బ్యాంక్ సంస్థలు భాగస్వామ్యమయ్యాయి. ఈ సందర్భంగా ఎన్ఆర్ఐ హాస్పిటల్ వైద్యుల పర్యవేక్షణలో 150 మందికి పైగా ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన మందులను ఉచితంగా పంపిణీ చేశారు. గాయత్రి కంటి ఆసుపత్రి వైద్యులు కంటి పరీక్షలు నిర్వహించి, శస్త్రచికిత్స అవసరమున్న వారిని విజయనగరంలోని ఆసుపత్రికి తీసుకెళ్లి ఉచిత ఆపరేషన్లు చేయనున్నట్లు తెలిపారు. ఎన్‌విఎన్ బ్లడ్ బ్యాంక్ ఆధ్వర్యంలో స్వచ్ఛంద రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రెడ్డి సురేంద్ర, ఎన్‌విఎన్ బ్లడ్ బ్యాంక్ మేనేజర్ నాగేశ్వరరావు, మాతృభూమి సేవా సంఘం కార్యదర్శి ఇప్పలవలస గోపాల రావు, ఎన్ఆర్ఐ హాస్పిటల్ వైద్యులు డాక్టర్ అభినయ్‌నాయుడు, డాక్టర్లు ప్రసన్నకుమార్, బి.శివాజీ, యువత పాల్గొన్నారు.

కాలువ గట్టును పరిశీలించిన ఎమ్మెల్యే

ప్రజాశక్తి - తెర్లాం

మండలంలోని గంగన్నపాడు గ్రామం చుట్టుపక్కల ఉన్న చెరువులకు సంబంధించి, ఆదివారం కురిసిన భారీ వర్షాలకు చెరువుల నిండి నీళ్ల గ్రామంలోనికి పారే క్రమంలో కాలువ ద్వారా ప్రవహించాల్సిన నీరు సరైన గట్టు లేనందున గ్రామంలోకి ప్రవేశిస్తుంది. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే బేబినాయన బుధవారం కాలువను ఇరిగేషన్ అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో కాలువ గట్టు నిర్మాణం ప్రారంభించినప్పటికీ, సకాలంలో బిల్లులు చెల్లించనందున మధ్యలోనే నిర్మాణ పనులు ఆగిపోయాయన్నారు. వెంటనే అధికారులతో మాట్లాడి, వారు తయారు చేసిన ప్రతిపాదనలను గత నెలలో జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడుకు అందజేశామన్నారు. త్వరలోనే నిధులు మంజూరు చేయించి, కాలువ గట్టు పనులు పూర్తి చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఇరిగేషన్ అధికారులు, ఎంపిడిఒ ఆర్.రాంబాబు, తహశీల్దార్ జి.హేమంత్ కుమార్, టిడిపి నాయకులు పాల్గొన్నారు.

పాడి రైతుకు ఆర్థిక సహాయం

మండలంలోని బొంగుపేట గ్రామానికి చెందిన ఎం ఆదినారాయణ అనే పాడి రైతు ఆవు ఆదివారం పిడుగు పడటం వల్ల మృతి చెందిన విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే బేబీ నాయన ఆ రైతుకు రూ.20 వేలు ఆర్థిక సహాయం అందించారు. ఈ కార్యక్రమంలో మండల పిఎసిఎస్ చైర్మన్ వెంకటేశ్వరరావు, ఎఎంసీ చైర్మన్ వెంకట్ నాయుడు, టిడిపి కార్యకర్తలు అమరాపు సురేష్, కారణం లవన్ కుమార్ పాల్గొన్నారు.

రైతు సంక్షేమానికి కృషి : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - చీపురుపల్లి

సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయిస్తున్న ఎమ్మెల్యే కళా

కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో రైతు సంక్షేమం కోసం ఎనలేని కృషి చేస్తోందని ఎమ్మెల్యే కిమిడి కళా వెంకట్రావు అన్నారు. బుధవారం చీపురుపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన పాలకవర్గ ప్రమాణ స్వీకారాన్ని స్థానిక రాధా మాధవ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఆయన మాట్లాడుతూ రైతు సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం అన్నారు. ఈ సందర్భంగా నూతన మార్కెట్ కమిటీ చైర్మన్ రేగాన రామారావు, వైస్ చైర్మన్‌గా వలిరెడ్డి శ్రీరాములునాయుడు ఇతర కమిటీ సభ్యులతో ఆయన సమక్షంలో ప్రమాణ స్వీకారం చేయించారు. రైతుల సమస్యలను ప్రాధాన్యంగా తీసుకుని పరిష్కరించేందుకు తాను ఎల్లప్పుడూ కృషి చేస్తానని ఎమ్మెల్యే భరోసా ఇచ్చారు. సాగునీటిని అందించే చర్యలు తీసుకుంటున్నట్లు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ నూతన చైర్మన్, వైస్ చైర్మన్, సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.

ఐఐఎఫ్ఎస్ఇ సంస్థకు జాతీయ స్థాయి గుర్తింపు

ప్రజాశక్తి - పూసపాటిరేగ

ఫైర్, హెల్త్, సేఫ్టీ ఎన్విరాన్మెంట్ విభాగంలో ఉత్తమ సేవలు అందించినందుకు పూసపాటిరేగకు చెందిన శ్రీను మహంతి సంస్థ ఐఐఎఫ్ఎస్ఇకు జాతీయ స్థాయి గుర్తింపు లభించింది. ఫైర్, హెల్త్, సేఫ్టీ అండ్ ఎన్విరాన్మెంట్ విభాగంలో ప్రతిష్టాత్మకమైన వరల్డ్ సేఫ్టీ ఆర్గనైజేషన్ నేషనల్ అవార్డ్ 2025ను ఐఐఎఫ్ఎస్ఇ గెలుచుకుంది. ఈ అవార్డును ముంబైలోని ది లలిత్ హొటల్‌లో జరిగిన కార్యక్రమంలో సంస్థకు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో దేశంలోని వివిధ పరిశ్రమల ప్రతినిధులు పాల్గొన్నారు. అవార్డును డైరెక్టరేట్ ఆఫ్ ఇండస్ట్రియల్ సేఫ్టీ అండ్ హెల్త్ మహారాష్ట్ర అదనపు డైరెక్టర్ శ్రీరామ్ భగీరథీబాయి దిగంబర్రావ్ దహిఫలే, గోద్రేజ్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అండ్ సిఇఒ విశాల్ శర్మ, తమిళనాడుకు చెందిన జహోరాన్స్కీ మౌల్డ్స్, మెషిన్స్ ప్రైవేట్ లిమిటెడ్, మేనేజింగ్ డైరెక్టర్ ఉవే జార్జ్ ఫిషర్, భారత ప్రభుత్వం రిటైర్డ్ కార్మిక ఉపాధి డైరెక్టర్ జనరల్ జిఎంఇకె రాజ్ అందజేశారు. ఈ సందర్భంగా ఐఐఎఫ్ఎస్ఇ డైరెక్టర్ శ్రీను మహంతి మాట్లాడుతూ, ఈ విజయం తమ సంస్థ శ్రేష్ఠత, భద్రత పట్ల నిబద్ధతకు నిదర్శనమని తెలిపారు. ఫైర్, హెల్త్, సేఫ్టీ, ఎన్విరాన్‌మెంట్ విభాగంలో ఉత్తమ సేవలకు ఈ అవార్డు లభించడం తమకు గర్వకారణంగా ఉందని తమ బృందం కృషికి ఇది గుర్తింపు, అని ఆయన అన్నారు.

అవార్డు, ప్రశంస పత్రాన్ని అందుకుంటున్న శ్రీను మహంతి

వేతనదార్లకు పని చూపించే బాధ్యత తీసుకోవాలి

ప్రజాశక్తి - నెల్లిమర్ల

ఉపాధి వేతనదార్లకు పని చూపించే బాధ్యత ఫీల్డ్ అసిస్టెంట్‌లు తీసుకువాలని గ్రామీణ ఉపాధి హామీ పథకం పీడీ ఎస్.శారద దేవి సూచించారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో మండల వ్యాప్తంగా రూ.21.01కోట్లతో చేపట్టిన 1223 పనులపై సామాజిక తనిఖీ ప్రజా వేదిక నిర్వహించారు. ఈ సందర్భంగా పారసాం, సతివాడ, మొయిద, పూతిక పేట, గుషిణి, అలుగోలు గ్రామాల్లో మస్తర్లు పట్టీలో దిద్దు బాట్లు, జోగిరాజు పేట, బొప్పడాం గ్రామాల్లో జరిగిన పనుల్లో మస్తర్ల పుస్తకంలో సంతకాలు లేకపోవడం గుర్తించారు. కాగా కొన్ని చెరువులు, ఫారం పాండ్లు జరిగిన పనుల్లో కొలతలు తేడాలు ఉన్నట్లు గుర్తించడంతో బాటు, టెక్కలి పంచాయతీలో మామిడి మొక్కలు చనిపోయినట్లు గుర్తించారు. దీనిపై పీడీ శారదదేవి మాట్లాడుతూ జరిగిన తేడాలు సరిదిద్దకపోతే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వేతనదార్లకు పని కల్పించడంతో బాటు కూలి గిట్టుబాటు అయ్యేలా ఫీల్డ్ అసిస్టెంట్లు బాధ్యత తీసుకోవాలన్నారు. పని ప్రదేశంలో సౌకర్యాలు కల్పించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డివిఒ వెంకటరమణ, ఎపిడి పద్మజ, ఎంపిడిఒ కె.రామకృష్ణ రాజు, ఎపిఒలు అరుణ కుమారి, రామారావు, ఈసిలు కార్తీక్, యుగేష్, సామాజిక తనిఖీ సిబ్బంది,పంచాయితీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్‌లు తదితరులు పాల్గొన్నారు.

ఫీల్డ్ అసిస్టెంట్‌ను వివరాలు అడిగి తెలుసుకుంటున్న పీడీ శారదదేవి

పోలీసుల త్యాగాలు మరువలేనివి

ప్రజాశక్తి - రామభద్రపురం

అమరులైన పోలీసుల త్యాగాలు మరువలేనివని అందుకే ఏటా అక్టోబర్ 3వ వారంలో వారి త్యాగాలకు గుర్తుగా పోలీసు అమరవీరుల వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు బొబ్బిలి రూరల్ సీఐ నారాయణరావు తెలిపారు. బుధవారం స్థానిక కస్తూరిబా గాంధీ బాలికా విద్యాలయంలో అమరవీరుల త్యాగ స్ఫూర్తిపై అవగాహన కలిగించారు. వారి స్ఫూర్తితో ప్రతి విద్యార్థీ దేశ రక్షణ, సమాజ శ్రేయస్సుకు కృషి చేయాలని పిలుపు నిచ్చారు. ప్రస్తుత సమాజంలో సోషల్ మీడియా వ్యాప్తి ఎక్కువగా ఉందని దానిలో మంచిని మాత్రమే గ్రహించి చెడును దూరంగా ఉంచాలన్నారు. వ్యక్తిగత భద్రతకు తీసుకోవాల్సిన రక్షణ మార్గాలు సూచించారు. ముఖ్యంగా బాలికలు, మహిళలు శక్తి యాప్ డౌన్లోడ్ చేసుకోవాలన్నారు. రోడ్ సేఫ్టీ, సైబర్ నేరగాళ్ల నుంచి రక్షణ చర్యలు వివరించారు. మాదక ద్రవ్య రవాణ, వినియోగంపై వచ్చే అనర్థాలపై అవగాహన కల్పించారు. విద్యార్థి దశ నుంచే క్రమశిక్షణతో ఉంటే భవిష్యత్తు బంగారు బాట అవుతుందని చట్టాలు వాటి పనితీరు ఇప్పటి నుంచే తెలుసుకొని మంచి పౌరులుగా ఎదగాలని కోరారు. ఈ సమావేశంలో ఎస్ఐ ప్రసాదరావు, విద్యాలయం సిబ్బంది, విద్యార్థినులు పాల్గొన్నారు.

సంతకవిటి: మండలంలోని పోలీసుల అమరవీరుల సంస్మరణ వారోత్సవాలు బుధవారం ఘనంగా జరిగాయి. సేవలో భాగంగా ప్రాణత్యాగం చేసిన పోలీసు సిబ్బందికి నివాళులర్పించేందుకు ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎస్ఐ ఆర్. గోపాలరావు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

రైతు సంఘం మండల కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి- గంట్యాడ

మండలంలోని రైతు సంఘం నూతన కమిటీ ఎన్నిక బుధవారం కొట్టారుబిల్లి జనక్షన్‌లోని కళ్యాణి మండపంలో ఏకగ్రీవంగా జరిగింది. ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బుద్ధరాజు రాంబాబు ఆధ్వర్యంలో జరిగిన ఎన్నికల్లో మండల కమిటీ అధ్యక్షులుగా కోడెల శ్రీను, కార్యదర్శిగా గుల్లపల్లి గంగు నాయుడు, ఉపాధ్యక్షులుగా కోటేశ్వరరావు, సూర్యదేవుడు, ఏర్నాయుడు, సహాయ కార్యదర్శిలుగా పైడినాయుడు, సునీల్ కుమార్, కోశాధికారిగా సాగి జగన్నాథ రాజులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

జామి మండల కమిటీ ఇదే

జామి మండలంలోని విజినిగిరి గ్రామంలో బుధవారం మండల రైతు సంఘం నూతన కమిటీ ఎన్నిక ఏకగ్రీవంగా జరిగింది. రైతు సంఘం జిల్లా కమిటీ సభ్యులు సిరికి శ్రీరామ్మూర్తి అధ్యక్షతన జరిగిన ఎన్నికల్లో అధ్యక్షులుగా చలుమూరి వెంకటరావు, కార్యదర్శిగా కసిరెడ్డి నారాయణరావు, గౌరవ అధ్యక్షులుగా కొత్తలు ఎర్నాయుడు, ఉపాధ్యక్షులుగా కళ్లెంపూడి రామునాయుడు, బొబ్బిలి రాము, సహాయ కార్యదర్శులుగా సిరికి ఏర్ని గోవిందా, వెంకట సత్యనారాయణ, ఎడ్ల నారాయణరావు, కోశాధికారిగా విసినిగిరి రవిలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

ముగిసిన రాష్ట్రస్థాయి ఎంపిక పోటీలు

ప్రజాశక్తి - భోగాపురం

భోగాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రెండు రోజులుగా జరుగుతున్న అండర్ 17 స్కూల్ గేమ్స్ ఎంపిక పోటీలు బుధవారం ఘనంగా ముగిసాయి. 200 మంది విద్యార్థులు పాల్గొని తలబడ్డారు. ఈ పోటీలను ఎమ్మెల్యే లోకం నాగమాధవి ప్రారంభించగా ఉదయం నుంచి క్రీడా మైదానం క్రీడలతో హోరెత్తింది. ఈ పోటీలు మండల క్రీడా కోఆర్డినేటర్లు ఎస్. నాగన్న, చిన్నారి ప్రత్యేక పర్యవేక్షణలో జరిగాయి. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు, స్కూల్ గేమ్స్ సెక్రటరీ కె. గోపాల్, విజయలక్ష్మి, ఎంపిడిఒ స్వరూపరాణి, ఇఒపిఆర్‌డి గాయత్రి, ఎంఇఒలు రమణమూర్తి, చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పరిశీలకునిగా కృష్ణంరాజు

కొత్తవలస: రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు పరిశీలకులుగా తాను ఎంపికైనట్లు నెల్లిమర్ల జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయులు కె.కృష్ణంరాజు తెలిపారు. ఈనెల 27 నుంచి 29 వరకు తూర్పు గోదావరి జిల్లా కొవ్వూరులో జరగనున్న రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలకు తనను పరిశీలకులుగా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని తెలిపారు. రాష్ట్రస్థాయిలో అత్యుత్తమ ప్రదర్శన కనబరిచిన క్రీడాకారులు నవంబర్ 10 నుండి 14 వరకు ఉత్తరప్రదేశ్ రాష్ట్రం రాయబరేలిలో జరుగునున్న జాతీయస్థాయి టోర్నమెంట్‌లో పాల్గొంటారని తెలిపారు. ఈ సందర్భంగా ఆయనకు పలువురు వ్యాయామ ఉపాధ్యాయులు శుభాకాంక్షలు తెలిపారు.

చీపురుపల్లి : తైక్వాండ్ పోటీలలో రాష్ట్రస్థాయిలో చీపురుపల్లికి తగిన గుర్తింపు తీసుకురావాలని చీపురుపల్లి నుంచి ఎంపికైన విద్యార్థులకు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రచార అధ్యక్షులు వలి రెడ్డి శ్రీనివాస నాయుడు సూచించారు. బుధవారం జెడ్‌పిటిసి కార్యాలయంలో జిల్లా స్థాయి జూనియర్ పోటీలలో విజేతలుగా నిలిచిన విద్యార్థులను ఆయన ప్రశంసించారు. ఈ నెల 24,25వ తేదీన జరిగే స్టేట్ లెవెల్ ఛాంపియన్ షిప్ పోటీలలో చీపురుపల్లికి తగిన గుర్తింపును తీసుకు రావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తైక్వాండో అకాడమీ నిర్వాహకులు శేఖర్ మాస్టార్ పాల్గొన్నారు.

విద్యార్థుల ఇండస్ట్రియల్ టూర్

బాడంగి : స్థానిక పిఎంశ్రీ జిల్లా పరిషత్తు పాఠశాలకు చెందిన 9,10వ తరగతి విద్యార్థులు బుధవారం ఇండస్ట్రియల్ టూర్‌లో భాగంగా రిటైల్, ఎలక్ట్రానిక్స్ విభాగాలకు సంబంధించిన పరిశ్రమలను సందర్శించారు. రిటైల్ విభాగం విద్యార్థులు రామభద్రపురంలో గల విశాఖ డైరీ, రిలయన్స్ మార్ట్ పాయింట్ మార్కెటింగ్, విక్రయ విధానాలు, కస్టమర్ సర్వీస్, జిఎస్టి, బిల్లింగ్ సిస్టమ్స్‌పై ప్రత్యక్ష అవగాహన పొందగా, ఎలక్ట్రానిక్స్ విభాగం విద్యార్థులు విద్యుత్ పరికరాల అసెంబ్లింగ్, సర్క్యూట్ డిజైన్, రిపేర్ అండ్ మెయింటెనెన్స్, ఎలక్ట్రికల్ సబ్ స్టేషన్ పవర్ సప్లై అంశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం దత్తి సత్యనారాయణ మాట్లాడుతూ విద్యార్థులు వివిధ రంగాల్లో నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోవడమే ఈ పర్యటన ఉద్దేశ్యమన్నారు. ఒకేషనల్ ఉపాధ్యాయులు కె.వెంకటరమణ, జి.దినేష్, షేక్ హసీనా, కొల్లి ఈశ్వరరావు, పాల్గొన్నారు.

రెండు బైకులు ఢీకొని ఒకరు మృతి

ప్రజాశక్తి - తెర్లాం

మండలంలో బుధవారం చుక్కవలస వద్ద రెండు బైకులు ఢీకొని జూనియర్ అసిస్టెంట్ కె.శ్రావణ్ కుమార్(33) మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం.. చుక్కవలస వద్ద ఎదురెదురుగా రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొనడంతో నెమలాం జిల్లా పరిషత్తు హై స్కూల్‌లో పనిచేస్తున్న జూనియర్ అసిస్టెంట్ శ్రావణ్ కుమార్ మృతి చెందాడు. ఈయన వెనుక ఉన్న అదే స్కూల్లో అటెండర్‌గా పనిచేస్తున్న బి.రమణమ్మకు తలపైన గాయాలయ్యాయి. ఈమెను చికిత్స నిమిత్తం రాజాంలో ప్రయివేటు ఆసుపత్రికి తరలించారు. ఎదెరుగా ఢీ కొట్టిన బూరిపేటకు చెందిన చింత శివాజీకి కూడా గాయాలయ్యాయి. సంఘటన స్థలాన్ని స్థానిక ఎస్ఐ సాగర్‌బాబు పరిశీలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. శ్రావణ్‌కుమార్ మృతదేహాన్ని బాడంగి సిహెచ్‌సికి పోస్టుమార్టం నిమిత్తం తరలించామన్నారు. మృతునికి భార్య నారాయణమ్మ, 8 సంవత్సరాలు కుమారుడు సాయి శ్రావణ్ ఉన్నారు. పెరుమాలి ఆసుపత్రి వద్ద భార్య రోధన చూపరులను కంటతడి పెట్టించింది. ఆస్పత్రి వద్ద ఎంఇఒ జె.త్రినాథరావు, నెమలాం జిల్లా పరిషత్తు హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు డి.సంగమేశ్వరరావు, ఉపాధ్యాయులు, యుటిఎఫ్ మండల పార్టీ అధ్యక్షులు జి.మునిస్వామి, బూరిపేట సర్పంచ్ బూరి మధుసూదన్ రావు సహాయక చర్యలు చేపట్టారు.

బలసలరేవు వంతెన వద్ద దొంగతనానికి యత్నం

ప్రజాశక్తి- సంతకవిటి

మండలంలోని వాల్తేరు బలసలరేవు వంతెన నిర్మాణ ప్రదేశంలో మంగళవారం రాత్రి దొంగతనానికి యత్నం జరిగింది. రాత్రి సమయంలో గుర్తుతెలియని వ్యక్తులు అక్కడ పనిచేస్తున్న వాచ్‌మెన్‌ను బెదిరించి బ్యాటరీ, షటర్లు అపహరించే ప్రయత్నం చేశారు. అయితే వాచ్‌మెన్ సాహసంతో వెంటనే సర్పంచ్ ప్రతినిధి జి.స్వామినాయుడుకు సమాచారం ఇచ్చాడు. సమాచారాన్ని అందుకున్న సర్పంచ్ ప్రతినిధి తక్షణమే సంఘటన స్థలానికి చేరుకుని, గ్రామ యువకులకు సమాచారం ఇచ్చి సంఘటన స్థలానికి పిలిపించారు. వారు కలిసి దొంగలను అదుపులోకి తీసుకునే ప్రయత్నం చేశారు. గ్రామస్తులు దర్యాప్తులో భాగంగా, దొంగతనానికి పాల్పడిన ఇద్దరిని చిన్నసిరిపురం గ్రామానికి చెందిన గొర్రెల వాసు, ప్రసాద్‌గా గుర్తించారు. యువకులు సేకరించిన సమాచారం ఆధారంగా, వంతెన నిర్మాణానికి సంబంధించిన ప్రాజెక్ట్ మేనేజర్‌కు సమాచారం ఇచ్చారు. ఈ మేరకు బుధవారం ఎస్ఐ ఆర్. గోపాలరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

'లెండి'లో ఘనంగా ఫ్రెషర్స్ డే వేడుకలు

భోగాపురం: స్థానిక లెండి డిగ్రీ కళాశాలలో బుధవారం ప్రెషర్స్ డే వేడుకలు పాయకరావు ఎస్టేట్లో ఘనంగా నిర్వహించారు. పాత, కొత్త విద్యార్థులు పాల్గొని ఒకరినొకరు పరిచయాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా కళాశాల కరస్పాండెంట్ చప్పా కిరణ్ మాట్లాడుతూ గురువుల పట్ల గౌరవం, క్రమశిక్షణతో మెలగాలని, ఉన్నత శిఖరాలను అధిరోహించాలనే తపన విద్యార్థులకు మెండుగా ఉండాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు నృత్యాలు, సాంస్కృతిక కార్యక్రమాలతో ఆకట్టుకున్నారు. వివిధ విభాగాల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రశంసాపత్రాలు, మెమెంటోలు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ చందాల బంగారురాజు, అధ్యాపకులు, విద్యార్థులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

పారిశుధ్య పనుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

ప్రజాశక్తి - బొబ్బిలి

పారిశుధ్య పనుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకుంటామని మున్సిపల్ కమిషనర్ ఎల్. రామలక్ష్మి హెచ్చరించారు. పట్టణంలోని బుధవారం పారిశుధ్య పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బహిరంగ ప్రదేశాలు, రోడ్లు, కాలువల్లో చెత్త వేసేవారిని గుర్తించి జరిమానా విధించాలన్నారు. మేదరబంద జంక్షన్ కాలువలో పూడికలు పేరుకుపోవడంతో తొలగించాలని ఆదేశించారు. ఇంటింటికి వెళ్లి తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించాలన్నారు. పారిశుధ్య పనుల్లో నిర్లక్ష్యం వహించకుండా చూడాలన్నారు. ఆమెతో శానిటరీ ఇన్‌స్పెక్టర్ మురళీ, సిబ్బంది ఉన్నారు.